క్లుప్తంగా

ఉపాధి సిబ్బందికి శిక్షణ

రౌతులపూడి: మండల పరిధిలోని గ్రామాల్లో 2022–23 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధీ హామీ పనులపై ఆదివారం నుంచి గ్రామాల్లో చేపట్టే సామాజిక తనిఖీపై శనివారం సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సామాజికి తనిఖీ స్టేట్ రిసోర్స్ పర్సన్ సీహెచ్ చిరంజీవి అప్పారావు ఆధ్వర్యంలో సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. సామాజిక తనిఖీ పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సారా బట్టీలపై దాడి

ప్రత్తిపాడు: మండలంలోని పెదశంకర్లపూడిలో సారా బట్టీలపై శనివారం స్థానిక స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) సిబ్బంది దాడి చేశారు. సారా తయారీకి సిద్ధం చేసిన వంద లీటర్ల పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. సంఘటన స్థలం నుంచి ఐదు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడు కాళ్ల వినయ్‌పై పరారీ కేసు నమోదు చేసినట్టు స్థానిక ఎస్ఈబీ సీఐ పి.అశోక్ తెలిపారు.

పేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్ల పంపిణీ



ప్రత్తిపాడులో విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేస్తున్న కామరాజు

ప్రత్తిపాడు: స్థానిక బజారు వీధి రామాలయం వద్ద శనివారం నిరుపేద విద్యార్థులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ చేశారు. స్థానిక శ్రీషిర్డీ సాయి జ్యూయలరీస్ అధినేత పడాల శ్రీనివాసరెడ్డి సమకూర్చిన పౌష్టికాహార కిట్లను సదా మీ సేవలో (ఎస్ఎంఎస్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి కామరాజు విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఎంఎస్ సభ్యులు భేరి రాంబాబు, జె.జగదీశ్వరి, శిరశాల లక్ష్మి, ఆవాల శ్రీనివాసరావు, జి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నవ చండీహోమం



తపోవనంలో నవ చండీహోమం నిర్వహిస్తున్న పీఠాధిపతి సరస్వతీ మహాస్వామి, వేదపండితులు

తుని రూరల్: కార్తిక ద్వాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కుమ్మరిలోవ తపోవనం ఆశ్రమంలో శనివారం నవ చండీహోమం నిర్వహించారు. పీఠాధిపతి సచ్చిదానంద సరస్వతీ మహాస్వామి ఆధ్వర్యంలో వేదపండితులు, వేద విద్యార్థులు చండీహోమం, పూర్ణాహుతి నిర్వహించారు.కార్తికమాసంలో ఆఖరి శనివారం ద్వాదశి పర్వదినాన నవచండీ హోమం నిర్వహించడం ఎంతో శుభకరమని సరస్వతీ మహాస్వామి తెలిపారు. డాక్టర్ పాండురంగారావు దంపతులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఆశ్రమంలో రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించి పూజలు చేశారు.

వైభవంగా కార్తిక దీపోత్సవం

గోకవరం: మండంలోని పెంటపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం రాత్రి కార్తిక దీపోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తిక దీపాలు వెలిగించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద కార్తిక వనసమారాధన జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

పీహెచ్‌సీలో నూతన భవనాల ప్రారంభం



కాత్రావులపల్లి పీహెచ్‌సీలో నూతన భవనాలను ప్రారంభిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహ నాయక్

జగ్గంపేట: మండలంలోని కాత్రావులపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ)లో కట్టమూరుకు చెందిన నెక్కంటి సీ ఫుడ్స్ రూ.15 లక్షలతో నిర్మించిన ఓపీ భవనం, డాక్టర్ క్వార్టర్స్‌ను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి జె.నరసింహనాయక్, నెక్కంటి సీ ఫుడ్స్ అడ్మిన్ మేనజర్ ఉండవల్లి గోపిచంద్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహ నాయక్ మాట్లాడుతూ నెక్కంటి సీఫుడ్స్ సిఎస్ఆర్ నిధులతో ఈ భవనాలు నిర్మించిందని, కరోనా సమయంలో కూడా నెక్కంటి సీ ఫుడ్స్ కాత్రావులపల్లి పీహెచ్‌సీకి ఆక్సిజన్ సిలిండర్లు అందించి ఎంతో మేలు చేసిందన్నారు. సీఫుడ్స్ సంస్థ చేస్తున్న సేవ కార్యక్రమాలను కొనియాడారు. కాత్రావులపల్లి పీహెచ్‌సీకి త్వరలో ఎక్స్‌రే మెషీన్ ఏర్పాటు చేసి, టెక్నీషియన్‌ను నియమిస్తామని తెలిపారు. అనంతరం డీఎంఅండ్‌హెచ్‌ఓ నరసింహనాయక్, సీ ఫుడ్స్ అడ్మిన్ మేనేజర్ గోపిచంద్, పీహెచ్‌పీ డాక్టర్లు రాజశేఖర్, పాపయ్యశాస్త్రిలను గ్రామస్తులు గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పిట్టా సుగుణరావు, నాయకులు ముసిరెడ్డి నాగేశ్వరరావు, సుంకర సీతారామయ్య, కంటే బుల్లబ్బి, వెన్న వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

చివరిలో అండదండ

- రైతులను నిండా ముంచిన తుపాను
- అండగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టం అంచనా వేస్తున్న అధికారులు

మిచాంగ్ తుపాను రైతులను నిండా ముంచింది. భారీ వర్షాలకు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది. క్షేత్ర స్థాయిలో నష్టాన్ని అంచనా వేసి ప్రతి రైతుకూ పరిహారం అందేలా చర్యలు తీసుకుంది. ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడకూడదన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు, ప్రజా ప్రతినిధులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టం అంచనా వేస్తున్నారు. కళ్లాల్లోనే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు తరలిస్తున్నారు.



జగన్నాథపురంలో పనలపై మొలకెత్తిన ధాన్యం



కేఈ చిన్నయ్యపాలెంలో పంట నష్టాన్ని అంచనా వేస్తున్న అధికారులు

కోటనందూరు: తుపాను మెట్టప్రాంతంలో తీవ్ర ప్రభావం చూపింది. భారీ వర్షాలకు తుని నియోజకవర్గంలో కోసి పనలపై ఉన్న పంట కొంతమేర మొలకెత్తగా వేల ఎకరాల్లో పంట నేలకొరిగింది. మరో పక్క పక్వానికి చేరిన వరి చేల్లో గింజ నేలరాలిపోతోంది. రూ.వేలల్లో పెట్టుబడి పెట్టి ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు చివరిలో వచ్చిన కష్టం పట్ల అన్నదాతలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

32 వేల ఎకరాల్లో వరిసాగు

తుని వ్యవసాయ సబ్‌డివిజన్ పరిధిలోని కోటనందూరు, తుని, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో ఈ ఏడాది 32 వేల ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. మిచాంగ్ తుపాను సమయానికి 10 శాతం పంట కోసి కల్లాల్లో పనలపై ఉంది. 50 శాతం పంట పక్వానికి చేరి ఉంది. భారీ వర్షాలకు ఈ మొత్తం పంటలకు నష్టం వాటిల్లింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ, వ్యవసాయశాఖ సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

ఆంక్షలు లేకుండా కొనుగోలు

ప్రభుత్వ ఆదేశాలతో ఎటువంటి ఆంక్షలు లేకుండా అధికారులు రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. ఆఫ్‌లైన్ పద్ధతిలో రంగు మారిన, తడిసిన ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. కేటాయించిన రైసు మిల్లుల ద్వారా రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసి ప్రభుత్వం నిర్ధారించిన కనీస గిట్టుబాటు ధర చెల్లిస్తున్నారు.

ఆకాశాన్నంటిన కూలి రేట్లు

తుపాను తొలగిన తరువాత రైతులంతా ఒకేసారి కోతకోయడం, నేలకొరిగిన, పనలపై ఉన్న పంటను ఒబ్బిడి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొనడంతో కూలిరేట్లు భారీగా పెరిగాయి. ఎకరం విస్తీర్ణంలో పంట కోతకు రూ. 3,500, మోపుల మోతకు ఒక్కొక్కరికీ రూ.1000 వరకూ పలుకుతోంది. మరో పక్క రైతులను కూలీల కొరత వేధిస్తోంది.

రెండెకరాల్లో పంట నష్టం



నేను రెండు ఎకరాల్లో వరి సాగు చేశాను. రూ.50 వేల వరకూ పెట్టుబడి పెట్టాను. ఆది నుంచి ప్రతికూల వాతావరణం కారణంగా ఎన్నో ఇబ్బందులు పడి రక్షించుకున్న పంట చివరకు నీటిపాలైంది. వర్షాలకు పంట నేలకొరిగి నీటిలో మునిగిపోయింది. బస్తా గింజలు కూడా వచ్చే పరిస్థితి లేదు. ఏటా రైతులకు ఈ ఇబ్బందులు తప్పడం లేదు. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– లోకా నాగేశ్వరరావు, రైతు, కేఈ చిన్నయ్యపాలెం

రైతులు నష్టపోకుండా ధాన్యం సేకరణ



మిచాంగ్ తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వ పరిహారం అందించేందుకు కృషి చేస్తోంది. క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటించి జరిగిన నష్టాన్ని అంచనా వేస్తున్నాం. రంగు మారిన ధాన్యాన్ని సైతం సేకరించి కనీస గిట్టుబాటు ధర చెల్లించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. పంటను రక్షించుకోవడంపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం.

– చంద్రశేఖర్, వ్యవసాయాధికారి, కోటనందూరు

నేటి నుంచి ఉపాధి హామీ సామాజిక తనిఖీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఆర్పీ చిరంజీవి అప్పారావు

శంఖవరం: మండల పరిధిలోని గ్రామాల్లో ఆదివారం నుంచి ఉపాధి హామీ సామాజిక తనిఖీలు నిర్వహించనున్నట్టు ఉపాధి ఏపీఓ రాజగోపాల్ తెలిపారు.స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం స్టేట్ రిసోర్స్ పర్సన్(ఎస్ఆర్పీ) సీహెచ్ చిరంజీవి అప్పారావు అధ్యక్షతన ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, మేట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్ పర్సన్ మాట్లాడుతూ 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామాల్లో జరిగిన ఉపాధిహామీ పనులపై తనిఖీలు నిర్వహిస్తామన్నారు. చెరువులు, కాలువల్లో పూడిక తీత, ఉదాన తోటల్లో జరిగిన పనులపై తనిఖీలు ఉంటాయన్నారు. తనిఖీలకు ఉపాధి హామీ కూలీలు సహకరించాలని కోరారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

రౌతులపూడి: స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో శనివారం ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజనలో భాగంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. సీహెచ్‌సీ డాక్టర్లు డాక్టర్ జానకీదేవీ, సునీత గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందజేశారు. గర్భిణులు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. వైద్య పరీక్షలకు వచ్చిన గర్భిణులకు రౌతులపూడికి చెందిన కొరుప్రోలు వెంకటసూర్యనారాయణమ్మ ఆర్థిక సహకారంతో భోజనాలు సమకూర్చారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ వాసిరెడ్డి భాస్కర బాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జిగిరెడ్డి శ్రీను, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మెన్ కె.సత్యనారాయణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు



జగ్గంపేటలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు

జగ్గంపేట: తాను ఎమ్మెల్యేగా విజయం సాధించడంలో క్రైస్తవులు కీలక పాత్ర పోషించారని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల చంటిబాబు అన్నారు. జగ్గంపేట వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గస్థాయి క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చంటిబాబు మాట్లాడుతూ క్రీస్తు బోధనలు అనుసరణీయమన్నారు. ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర క్రిస్టియన్ కార్పొరేషన్ డైరెక్టర్ జాన్ వెస్లీ, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి ఒమ్మి రఘురాం, మండల సచివాలయాల కన్వీనర్ బండారు రాజా, ఫెలోషిప్ నాయకుడు కుమార్ పాల్, ప్రసాద్, సుదర్శన్, శామ్యూల్ సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గోకవరంలో ఐక్య గ్రాండ్ క్రిస్మస్

గోకవరం: గతవారం తుపాను కారణంగా వాయిదా పడిన నియోజకవర్గ గ్రాండ్ ఐక్య క్రిస్మస్‌ను ఆదివారం నిర్వహించనున్నట్టు పాస్టర్ ఫెలోషిప్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్‌కుమార్ హాలోనెస్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. గోకవరం శివారున లే అవుట్‌లో సాయంత్రం 5 గంటల నుంచి క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తామన్నారు. ఏపీ పెంతెకోస్తు ఫెలోషిప్ అధ్యక్షుడు జాన్ లాజరస్, ఏపీ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షుడు బిషప్ ప్రతాప్‌సిన్హా ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన క్రైస్తవులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

గోకవరం: మండలంలోని తంటికొండ గ్రామంలో ప్రసిద్ధిగాంచిన వెంకటగిరి కొండపై వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. కార్తికమాసంలో చివరి శనివారం, సెలవు దినాన్ని పురస్కరించుకుని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ అర్చకులు తెల్లవారుజామున స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం దేవస్థానం ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు.

వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

గండేపల్లి: తాళ్లూరు మఠంలో వేంచేసిన శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. గ్రామస్తులతో పాటు, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. పండితులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం జీయర్ శాశ్వత అన్నదాన నిధి కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



పెదశంకర్లపూడిలో నేలనంటిన వరి పంటను పరిశీలిస్తున్న కుమారస్వామి



కాత్రావులపల్లిలో మిరప పంటను పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖాధికారి మల్లికార్జున్

ప్రత్తిపాడు: మిచాంగ్ తుపాను కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యుడు జలగం కుమారస్వామి కోరారు. మండలంలోని ప్రత్తిపాడు, లంపకలోవ, పెదశంకర్లపూడి, ఉత్తరకంచి, ధర్మవరం గ్రామాల్లో వర్షాలకు దెబ్బతిన్న పంటలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో నీట మునిగిన వరి పనలకు మొలకలు వచ్చాయన్నారు. రైతులు అధైర్య పడొద్దన్నారు. ప్రభుత్వం పూర్తి స్థాయిలో ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట బీకేఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాసంశెట్టి రాజా, దొడ్డిపట్ల సోమన్నదొర, పెదిరెడ్ల గంగారావు, భేరి రాము తదితరులు ఉన్నారు.

ఉద్యాన పంటల పరిశీలన

జగ్గంపేట: మండలంలోని కాత్రావులపల్లి, సీతానగరం గ్రామాల్లో తుపాను కారణంగా దెబ్బతిన్న ఉద్యాన పంటలను జిల్లా ఉద్యానశాఖాధికారి మల్లికార్జున్ శనివారం పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. పంట సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖాధికారి పి.లావణ్య, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

జలపాతం వద్ద పర్యాటకుల సందడి



తోటపల్లి జలాశయం వద్ద సందడి చేస్తున్న విద్యార్థులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని తోటపల్లి జలపాతం వద్ద శనివారం విద్యార్థులు, పర్యాటకులు సందడి చేశారు. ప్రత్తిపాడులోని పలు పాఠశాలల విద్యార్థులు విహారయాత్రగా శాంతి ఆశ్రమం, తోటపల్లి జలాశయాలను సందర్శించారు. శాంతి ఆశ్రమం విశిష్టతను విద్యార్థులకు ఉపాధ్యాయులు వివరించారు. అనంతరం తోటపల్లి జలాశయంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు స్నానాలు చేసి ఉల్లాసంగా గడిపారు. తొలుత ఉసిరి చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆట పాటలతో సందడి చేశారు. ధర్మవరంలోని పలు పాఠశాలల విద్యార్థులు రాచపల్లి అరుణాచల క్షేత్రంలో సందడి చేశారు.

కార్తిక వనసమారాధన



కృష్ణునిపాలెం శివాలయంలో లక్షపత్రి పూజ నిర్వహిస్తున్న భక్తులు

గోకవరం: మండలంలోని కృష్ణునిపాలెం విశ్వేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం కార్తిక వనసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తుల సహకారంతో భారీ వనసమారాధన ఏర్పాటు చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన సుమారు నాలుగు వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. తొలుత ఆలయంలో స్వామి వారికి లక్షపత్రి పూజ నిర్వహించారు.

మృతుడు సోమరాయునిపేట వాసిగా గుర్తింపు

ప్రత్తిపాడు: కిర్లంపూడి మండలం గోనేడ వద్ద ఏలేరు కాలువలో పడి మృతి చెందిన వ్యక్తి సోమరాయునిపేట వాసిగా పోలీసులు గుర్తించారు. ఏలేరు కాలువలో గుర్తుతెలియని మృతదేహాన్ని శుక్రవారం సాయంత్రం గ్రామస్తులు గుర్తించిన సంగతి తెలిసిందే. కాగా కిర్లంపూడి మండలం సోమరాయునిపేట గ్రామానికి చెందిన మొండి కోటిపల్లి (50) బహిర్భూమికి వెళ్లి ఏలేరు కాలువలోకి దిగాడు. ప్రమాదవశాత్తూ కాలు జారిపడి మృతి చెందాడు. మృతదేహం గోనేడ వంతెన వద్దకు కొట్టుకొచ్చింది. శనివారం మృతదేహాన్ని వెలికి తీసి, శవపరీక్షకై ప్రత్తిపాడు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. కిర్లంపూడి ఏఎస్సై కె.రామకృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముంపులోనే వరి పొలాలు





కోదాడలో పంట నష్టాన్ని అంచనా వేస్తున్న ఏఓ నరసింహం. నీటిలో ఉండిపోవడంతో మొలకలొచ్చిన వరిపైరు (అంతర చిత్రం)

తొండంగి: తుపాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు నీట మునిగిన వరిపొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వచ్చిన వరదనీరు కోదాడ, ఏవీ నగరం, కొమ్మనపల్లి తదితర ప్రాంతాల్లోని పొలాలను ముంచెత్తింది. ఈ నీరు జమ్మేరు ద్వారా శ్రీరాంపురం వరకూ వెళ్లి సముద్రంలో కలవాల్సి ఉంది. మెట్ట ప్రాంతం నుంచి వచ్చిన నీరంతా నిలిచిపోవడంతో రోజుల తరబడి వరిపొలాలు ముంపులోనే ఉన్నాయి. నీరు చేలల్లో ఉండిపోవడంతో పంటలు కుళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పనలపై ఉన్న చేలల్లో ఇప్పటికే మొలకలు వచ్చాయి. కాగా ప్రభుత్వ ఆదేశాల మేరకు రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేస్తున్నారు.

ఆశా వర్కర్ల వేతనం పెంచాలి



తునిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆశ వర్కర్ల సంఘ ప్రతినిధులు

తుని: ఆశ వర్కర్ల కనీస వేతనాన్ని రూ.26 వేలకు పెంచాలని ఆ సంఘ జిల్లా కార్యదర్శి చంద్రమళపద్మ డిమాండ్ చేశారు. స్థానిక వీరవరపుపేట అంబేడ్కర్ భవనంలో శనివారం ఆశావర్కర్ల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షురాలు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు రిటైర్మెంట్ బెనిఫిట్స్, వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. రూ.10 వేల జీతం ఇస్తున్నామన్న నెపంతో ప్రభుత్వం వారికి సంక్షేమ పథకాలు వర్తింపజేయకపోవడం అన్యాయమన్నారు. డిసెంబర్ 14, 15 తేదీల్లో కాకినాడ కలక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ధర్నా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆశా వర్కర్ల జిల్లా కార్యదర్శి నల్ల ఈశ్వరి, సీఐటీయూ మండల నాయకులు నక్కెళ్ల శ్రీనివాసు పాల్గొన్నారు.

మాదిగ ఆత్మీయ సభను విజయవంతం చేయాలి



కొలిమేరులో పర్యటించిన మోసే, మాదిగ నాయకులు

తుని రూరల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కొంకాపల్లిలో ఈ నెల 11న జరిగే మాదిగ, మాదిగ ఉపకులాల రాజకీయ ఆత్మీయ మహాసభను విజయవంతం చేయాలని మాదిగ రక్షణ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఆరుగుల మోసే పిలుపునిచ్చారు. తుని, కోటనందూరు మండలాల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. మాదిగలు, మాదిగ ఉపకులాల నాయకులను కలుసుకున్నారు. అమలాపురం సమీపంలోని కొంకాపల్లి సత్తెమ్మతల్లి ఆలయం ప్రాంగణంలో ఈ నెల 11 మధ్యాహ్నం రెండు గంటలకు రాజకీయ ఆత్మీయ మహాసభ నిర్వహిస్తామన్నారు. ప్రజా సంకల్పయాత్రలో ఇచ్చిన మాట ప్రకారం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాదిగలకు ఎమ్మెల్సీ పదివి ఇచ్చి గుర్తింపునిచ్చారన్నారు. అటువంటి నాయకుడికి అండగా ఉండాలని, మాదిగలకు, ఉపకులాలకు ఇతర రాజకీయపార్టీల నుంచి గుర్తింపు సాధించేందుకు మహాసభ నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. మరోసారి తుని నియోజకవర్గ ఎమ్మెల్యేగా దాడిశెట్టి రాజాను, రాష్ట్ర ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలుపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. మాదిగలు, మాదిగ ఉపకులాలకు రాజకీయ గుర్తింపునిచ్చిన వైఎస్సార్ సీపీ బలోపేతానికి కట్టుబడి ఉన్నామని తెలిపారు. యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

రాజీ మార్గమే రాజమార్గం



తునిలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తులు



ప్రత్తిపాడు లోక్ అదాలత్‌లో ఫిర్యాదుదారుడికి నష్టపరిహారం అందిస్తున్న న్యాయమూర్తి భాను

తుని: కేసుల పరిష్కారంలో రాజీ మార్గమే రాజమార్గమని స్థానిక కోర్టు జడ్జిలు కె.బాలకోటేశ్వరరావు, స్వర్ణలత అన్నారు. స్థానిక కోర్టు హాలులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. కక్షిదారులకు సంబంధించిన 118 కేసులను పరిష్కరించి రూ.44.54 లక్షల ఆదాయాన్ని సమకూర్చారు. ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకొని కేసులకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 137 కేసుల పరిష్కారం

ప్రత్తిపాడు: స్థానిక జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. న్యాయమూర్తి కాటం భాను 137 కేసులను పరిష్కరించారు. ఐదు మనోవర్తి కేసుల్లో రూ.1.60 లక్షలు, ఐదు గృహ హింస కేసుల్లో రూ.1.60 లక్షలు, రెండు చెక్ బౌన్స్ కేసుల్లో రూ.7.20 లక్షలు, 10 సివిల్ కేసుల్లో రూ.8.80 లక్షలు, 14 బీఎస్ఎన్ఎల్ కేసుల్లో రూ.17,945 బాధితులకు నష్ట పరిహారంగా చెల్లించాలని తీర్పునిచ్చారు. 2020 మే 16 నుంచి 2023 ఆగస్టు 29 మధ్య కాలంలో ప్రత్తిపాడు, కిర్లంపూడి, శంఖవరం, ఏలేశ్వరం మండలాల్లో పట్టుబడిన డ్యూటీ పెయిడ్, నాన్ డ్యూటీ పెయిడ్ కేసుల్లో ప్రభుత్వానికి రూ.1,12,590 చలానా కట్టించారు. మొత్తం 112 క్రిమినల్ కేసులు, 15 ప్రి లిటిగేషన్ కేసులు, 10 సివిల్ కేసులను పరిష్కరించారు. కోర్టు ప్యానెల్ అడ్వకేట్ బుగత శివ, లోక్ అదాలత్ బాధ్యురాలు శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు సైకిళ్లు బహూకరిస్తున్న రిలయన్స్ ప్రతినిధులు

కోటనందూరు: స్థానిక జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. కాకినాడలో శుక్రవారం రిలయన్స్ సంస్థ ఆధ్వర్యంలో ధీరూబాయి అంబానీ పేరుతో క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లాలోని పలు పాఠశాలల నుంచి 70 మంది విద్యార్థులు పాల్గొనారు. కోటనందూరు హైస్కూల్ నుంచి పాల్గొన్న కీర్తి వీరవెంకటదుర్గా భవానీ, సియాద్రి అవినాష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి తృతీయస్థానం సాధించారు. విజేతలకు రిలయన్స్ సంస్థ ప్రతినిధులు సైకిళ్లను బహూకరించారు. ఇంగ్లిషు ఉపాధ్యాయుడు నాగభూషణం విద్యార్థులను క్విజ్ పోటీలకు సమాయత్తం చేశారు. విజేతలను హెచ్ఎం వేణుగోపాల్, పీఎంసీ చైర్మన్ ఉల్లూరి శ్రీను అభినందించారు.

నేడు జాతీయ స్థాయి కరాటే పోటీలు

సామర్లకోట: స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని డీఎస్ఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం రెండో జాతీయ స్థాయి కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ జిల్లా చైర్మన్ చిత్తూలూరి వీర్రాజు, విక్టరీ షోటోఖాన్ కరాటే అసోసియేషన్ రాష్ట్ర చీఫ్ డి.శంకరరావు తెలిపారు. శనివారం టోర్నమెంట్‌కు సంబంధించిన ఓవరాల్ చాంపియన్ షిప్ ట్రోఫీని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్థానిక విలేకర్లతో వారు మాట్లాడుతూ లయన్స్ క్లబ్ సహకారంతో నిర్వహిస్తున్న టోర్నమెంట్‌లో 10 రాష్ట్రాల నుంచి సుమారు 900 మంది క్రీడాకారులు, కరాటే కోచ్‌లు పాల్గొంటారని చెప్పారు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం వరకూ పోటీలు జరుగుతాయన్నారు. లయన్స్ క్లబ్ జిల్లా గవర్నర్ వెల్లూరు సూర్యనారాయణ, జిల్లా మొదటి గవర్నర్ ఈదల ఈశ్వరకుమార్, రెండో గవర్నర్ వి.కోటేశ్వరరావు, మాజీ గవర్నర్ డాక్టర్ బాదం బాలకృష్ణ పాల్గొని బహుమతులు అందజేస్తారని తెలిపారు. సమావేశంలో లయన్స్ క్లబ్ రీజినల్ చైర్మన్ చిత్తూలూరి శ్రీదేవి, కరాటే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంవీఎస్ఎన్ మూర్తి, ఆర్గనైజింగ్ కమిటీ నాయకులు బి.రామారావు, ఎం.లోవరాజు తదితరులు పాల్గొన్నారు.